నిధులు లేక.. నిర్వహణ భారం

- 33 నెలలుగా విడుదల కానీ నిధులు
- జిల్లా వ్యాప్తంగా రూ.2.10 కోట్ల బకాయిలు
- మెయింటనెన్స్ కోసం ఇబ్బంది పడుతున్న ఏఈవోలు


పెగడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక

పెగడపల్లి: రైతులకు సలహాలు, సూచనలు అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన రైతువేదికలు అలంకార ప్రాయంగా మారాయి. రైతు సంక్షేమమే పని చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం వాటి నిర్వహణ మరిచి పోయిందని రైతులు విమర్శిస్తున్నారు. జిల్లాలో 71 క్లస్టర్లున్నాయి. మండల కేంద్రాల్లోని రైతు వేదికలో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అయితే వీటి నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. నిధులు రాక పోవడంతో తమపై ఆర్థికంగా భారం పడుతోందని ఏఈవోలు వాపోతున్నారు.

రైతు వేదికల నిర్వహణ ఖర్చు ఇలా..

రైతువేదికల నిర్వాహణకు ప్రభుత్వం తాగునీటికి రూ.500, పరిశుభ్రతకు రూ.3000, మరమ్మతులకు రూ.1000, విద్యుత్ చార్జీలకు రూ.1000, స్టేషనరీ, జిరాక్స్‌కు రూ.1000, శిక్షణ ఖర్చులకు రూ. 2500 చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయా క్లస్టర్ల ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రైతు వేదికల గోడలు పగుళ్లు ఏర్పడి తలుపులు, కిటికీలు దెబ్బతింటున్నాయి. అంతే కాకుండా రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. 33 నెలలుగా రైతు వేదికల నిర్వహణకు సంబంధించి నిధులు రాలేదని ఏఈవోలు వాపోతున్నారు.

భారంగా మారిన నిర్వహణ

రైతు వేదికల నిర్వహణ భారం తామే మోయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెల తాము తమ వేతనాల నుంచి చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 71 క్లస్టర్లుగా విభజించి 71 రైతు వేదికలను నిర్మించారు. మొదట్లో ఒక్కో రైతు వేదిక నిర్వాహణకు నెలకు రూ. 3 వేలు చొప్పున నిధులు విడుదల చేసింది. ఆ నిధులు సరిపోక 2020 ఏప్రిల్ నుంచి రూ. 9 వేలకు పెంచింది. 2022 ఆగస్టులో 5 నెలలకు సంబంధించి ఒక్కో రైతువేదికకు రూ. 45 వేల చొప్పున విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 33 నెలలుగా నిధులు విడుదల చేయలేదు. దీంతో ఒక్కో రైతు వేదికకు రూ. 2.97 లక్షల చొప్పున జిల్లా వ్యాప్తంగా 71 రైతు వేదికలకు రూ. 2.10 కోట్లకు పైగా బకాయిలు పేరుకు పోయాయి. విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, స్టేషనరీ ఖర్చులు, రైతులకు శిక్షణలు, తాగునీటి సదుపాయం, మరమ్మతుల నిమిత్తం తమ వేతనాల నుంచే భరిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు వేదికల్లో అటెండర్లు లేక పోవడంతో అన్ని పనులు ఏఈవోలే చేసుకుంటున్నారు. తాళాలు తీయడం, గదులు శుభ్రం చేయడం, సమావేశాల సమయాల్లో ఏర్పాట్లు చేసుకోవడంలాంటి అన్ని పనులే తామే చేసుకోవాల్సిన వస్తోందని ఏఈవోలు వాపోతున్నారు. రైతువేదికల నిర్వహణ తమకు భారంగా ఉందని నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఏఈవోలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..



రైతు వేదికల నిర్వహణకు రావాల్సిన నిధుల బకాయిలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఒక్కో రైతు వేదికకు నెలకు రూ. 9 వేల చొప్పున రూ. 2.97 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అయినా రైతుల శిక్షణలు, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణకు ఏలాంటి ఆటంకం లేకుండా చూస్తున్నాం. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలి.

– భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

మల్యాలలో గాయత్రి బ్యాంకు ప్రారంభం


బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్యాల: గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖను మల్యాలలో ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గాయత్రి బ్యాంకు సీఈవో వనమాల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ అభివృద్ధికి తొలి మెట్టు అని, పొదుపు భవిష్యత్ అవసరాలకు ఆసరగా నిలుస్తుందన్నారు. అనంతరం మహాలక్ష్మి టింబర్ డిపో ప్రారంభించారు. కార్యక్రమంలో దారం ఆదిరెడ్డి, ముత్యాల రాంలింగారెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొండపల్కల రాంమోహన్‌రావు, మాజీ సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషపై అవగాహనకు శిక్షణ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కోరుట్ల: తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఉర్దూ బాష పై అవగాహన పెంచేందుకు ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నుంచి శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. 20 రోజుల పాటు ప్రతీ రోజు సాయంత్రం శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, విద్యార్థులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేశామని నిర్వహకులు తెలిపారు. అబిద్ అలీ ఖాన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, సియాసత్ దిన పత్రిక ఆధ్వర్యంలో విద్యార్థులకు అసాన్ ఉర్దూ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటా పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, ప్రధాన కార్యదర్శి ఫసీద్దీన్ షకీల్, మోమిన్, మహ్మద్ ముబీన్, సలీం ఫారుఖీ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

కోరుట్ల: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో డివిజన్‌లోని పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు తమ ఇబ్బందులను వివరించారు. రిటైర్మెంట్ పొంది పది మాసాలు గడిచినా తమ విరమణ ప్రయోజనాలు ఇంత వరకూ అందక పోవటంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకుబ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి గంటేడి రాజ్‌మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక గంగారాం, అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్, కోరుట్ల, మేడిపెల్లి, కథలాపూర్ మండలాల పెన్షనర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం

ధర్మపురి: ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వేముల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా ఒడ్డేటి నరేశ్, కోశాధికారిగా కడారి గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల కార్యక్రమానికి జిల్లా బాధ్యులు హాజరయ్యారు. ఎన్నికైన కమిటీని పలువురు అభినందించి సన్మానించారు.

హిందూ ఏక్తాయాత్రకు తరలిరావాలి


భీమారంలో సమావేశమైన బీజేపీ నాయకులు

మేడిపల్లి: మే 22 న కరీంనగర్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ ఏక్తాయాత్ర కు హిందువులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని బీజేపీ భీమారం మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ కోరారు. భీమారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలం నుంచి భారీగా తరలివెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాడపు వెంకటేశ్,జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, మండల మాజీ అధ్యక్షులు ముంజ శ్రీనివాస్, నాయకులు కాటిపెల్లి జగన్ రెడ్డి, అన్నాడి జలపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: ఈ నెల 22 న కరీంనగర్‌లో నిర్వహించే హిందూ ఏక్త యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారుతి కోరారు. కథలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో బూత్ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. హిందూ ఏక్త యాత్రకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు,వినోద్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్,లింగం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మించరూ..



బుగ్గారం: మండలంలోని వెల్గొండ అనుబంధ గ్రామం గుండ్లపల్లెలో అసంపూర్తి డ్రైయినేజీతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. 46 ఇళ్లు ఉన్న ఈ పల్లెలో గతంలో డ్రైయినేజీ నిర్మించినప్పటికీ అది పూర్తి చేయలేదు. దీంతో డ్రైయినేజీ లేని ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉంటూ దుర్వాసన వస్తోంది. అలాగే దోమలు వృద్ధి చెందుతున్నాయి. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డ్రైయినేజీ నిర్మాణాన్ని పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యార్థులను సన్మానించిన మార్కండేయ సేవా సమితి సభ్యులు

విద్యార్థులకు సన్మానం

మల్లాపూర్: విద్యార్థులు గమ్యం చేరేవరకు తీవ్రంగా శ్రమించాలని మార్కండేయ సేవా సమితి సభ్యులు అన్నారు. ఎస్సెస్సీ టాపర్‌గా నిలిచిన మధురిమ(564/600)తో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎస్సెస్సీ ఫలితాలలో స్కూల్ టాపర్లను ఆదివారం వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో మార్కండేయ సేవా సమితి సభ్యులు గుమ్మడి మల్లేశ్, ఆడేపు రాజేష్, దువ్వ నవీన్, బండారి మల్లేష్, నందు, నాగరాజు, శ్రీనివాస్, పద్మశాలీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్ర శివారులో ఓ పాత ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. బీర్‌పూర్ ట్రైనీ ఎస్సై రాజు కథనం ప్రకారం బీర్‌పూర్‌లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి దాడి చేయగా, ఆరుగురు వ్యక్తులు డబ్బులు బెట్టింగ్ పెట్టి మూడు పత్తాల ఆట ఆడుతున్నారని, వారి నుంచి రూ. 8,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి గేదెలు మృతి

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన నానం సుమలత, మూలసపు మహేశ్వరికి చెందిన గేదెలు ఆదివారం ప్రమదవశాత్తు బావిలో పడి మృతిచెందాయి. దాహార్తి తీర్చుకోవడం కోసం బావిలో దిగగా ప్రమాదవశాత్తు జారిపడగా రెండు గేదెలు మృతిచెందాయి. వీటి విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యాంగంలో అంబేడ్కర్ ఆత్మ

జగిత్యాలటౌన్: రాజ్యాంగంలో అంబేడ్కర్ ఆత్మ ఉందని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. ప్రభుద్ద భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జ్ఞానం ద్వారానే ప్రశ్నించే అవకాశం లభిస్తుందని, విద్యను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఫౌండేషన్ (డిక్కీ) జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల నారాయణ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘పచ్చిరొట్ట విత్తనాల ధర పెంపుతో రైతులకు నష్టం’

సారంగాపూర్: పచ్చిరొట్ట విత్తనాల ధరలను ప్రభుత్వం భారీగా పెంచడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని బీఆర్‌ఎస్ పార్టీ బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల అధ్యక్షులు నేరెల్ల సుమన్‌గౌడ్, తేలు రాజు అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో ఆదివారం వారు మాట్లాడారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించడానికి రైతులు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసి, దిగుబడులు పెంచుకుంటారని, ప్రభుత్వం రైతులు ఎన్నడూ చూడని విధంగా జనుము, జీలుగ విత్తన ధరలను పెంచడం వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయడానికేనన్నారు. ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు బండారి వెంకటేశ్, అనంతుల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు



పెగడపల్లి:పెగడపల్లి, నంచర్ల ప్రాథమిక సహకార సంఘాల్లో రాయితీపై అందించే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలతో సంబంధిత ఏఈవోల వద్ద పర్మిట్ తీసుకుని విత్తనాలు పొందవచ్చని పేర్కొన్నారు.

మల్యాల మండలంలో..

మల్యాల: మండలంలోని మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పోతారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మల్యాల డీసీఎంఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం,లో పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము రాయితీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. ఆసక్తిగల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్ వివరాలతో మల్యాల, నూకపల్లి, మానాలలోని రైతు వేదికల్లో విత్తనాలు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీరాజ రాజేశ్వర ఉన్నత పాఠశాలలో 1994–1995 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని వశిష్ఠ ఇన్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నెమరుగొమ్ముల తిరుపతిరావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సారంగాపూర్: జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్–బీర్‌పూర్ మండలాలకు వచ్చే ప్రధాన రహదారి ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉంది. జగిత్యాల నుంచి వచ్చే క్రమంలో తిప్పన్నపేట, హైదర్‌పల్లి గ్రామాల మధ్య ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రోడ్డును అనుకుని తుమ్మ చెట్లు విస్తరిస్తున్నాయి. ఈ చెట్లు తారురోడ్డు మీది వరకు విస్తరించడంతో ద్విచక్రవాహనదారుల కళ్లకు, శరీరంలోని ఇతర భాగాలకు వాహనదారులకు తుమ్మ ముళ్లు తగిలి గాయాలవుతున్నారు. అధికారులు వెంటనే వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, బల్దియా కమిషనర్, ధర్మపురి సెల్ నం 6304101019

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ చేసిందేమిటి?


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి: పదేండ్ల పాటు కొనసాగిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధర్మపురికి చేసిన అభివృద్ధి ఏంటో చూపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు అన్నారు.ఆదివారం ధర్మపురిలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పైన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి ప్రజలకు కనీసం తాగునీటి కోసం శాశ్వత పరిష్కారం చూపించలేక పోయారని, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముందుగా మంచినీటి కోసం శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ధర్మపురిలో అమృత్02 పథకం కింద వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడుతూ నీటి సరఫరా కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గెలిచిన తక్కువ సమయంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఇటీవల మంత్రి సీతక్క 20 కోట్ల రూ.ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సింహరాజు ప్రసాద్, చిలుముల లక్ష్మణ్, సుముఖ్, అసెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

అభివృద్ధిపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బుగ్గారం: మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ కోట్లాది రూ.లతో అభివృద్ధి చేసినప్పటికి కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన చేసిన అభివృద్ధి పనులపై మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్ అన్నారు. బుగ్గారంలో ఆదివారం మాట్లాడారు. ప్రభుత్వ విప్‌గా ఉండి రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించుకోకుండా అభివృద్ధి ఏ విధంగా చేస్తారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా మాజీ మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం సత్తయ్య, రహమాన్, పూర్ణచందర్ బుచ్చన్న, జగన్ తదితరులున్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం


మాట్లాడుతున్న సముద్రాల విజయసారథి

జగిత్యాలటౌన్: నిర్మల్ జిల్లాలోని పవిత్ర బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బ్రాహ్మణ సంఘం(టీబీఎస్ఎస్) రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం జగిత్యాలకు విచ్చేసిన విజయసారథి స్థానిక బ్రాహ్మణ సంఘం బాధ్యులతో కలిసి మాట్లాడారు. దైవసేవలో నిమగ్నమైన పూజారిపై దాడి చేయడం అమానుషమన్నారు. అర్చకునిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీబీఎస్ఎస్ ప్రతినిధులు గోవర్ధనగిరి ధీరజ్‌కృష్ణమచారి, నమిలకొండ యశస్వీభరద్వాజ్, చాకుంట వేణుమాధవరావు, సిరిసిల్ల రాజేందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న ఆలయ గోపురం పనులు


కొనసాగుతున్న దుబ్బరాజన్న రాజగోపురం పనులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రూ. 82 లక్షలతో చేపట్టిన దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయి. రాజగోపుర నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరి చకచకా కొనసాగుతున్నాయి. దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ. 82 లక్షలు దేవాదాయా శాఖ నుంచి మంజూరు చేసింది. ఈ నిధులతో ఆలయం చుట్టు ప్రాకార నిర్మాణం, రాజగోపుర నిర్మాణ పనులు చేపట్టారు. ప్రాకార నిర్మాణ పనులు 80 శాతం వరకు పూర్తి కాగా, అందులో శిల్పుల పని మిగిలి ఉంది. అదేవిధంగా రాజగోపుర నిర్మాణం పనులు ముగింపు దశకు చేరాయి. ఇక్కడ కూడ శిల్పులు పని చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోకపోవడంతో దాతలు పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తున్నారు.